సాక్షి
కాకినాడ
మంగళవారం । 25 । జూన్ । 2024



నకిలీ సిగరెట్లపై విజిలెన్స్

రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అమలాపురంలోని మూడు హోల్ సేల్ షాపులపై సోమవారం దాడులు చేసి రూ.17.44 లక్షల విలువైన నకిలీ సిగరెట్లను సీజ్ చేశారు.


8లో



మండపేటలో మరో శిలాఫలకం ధ్వంసం

కూటమి పార్టీల కార్యకర్తలు శిలాఫలకాల ధ్వంసంతో పేట్రేగిపోతున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ మండిపడ్డారు.

డెల్టాలకు 8,590 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 8,590 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,380, మధ్య డెల్టాకు 1,710, పశ్చిమ డెల్టాకు 4,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.70 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గోకవరం: వీరలంకపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకూ ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కేఎంపీ రాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశానికి ఎస్సీలకు 3, బీసీ-సికి 10, బీసీకి ఒకటి కలిపి మొత్తం 14 సీట్లు ఉన్నాయన్నారు. ఏడో తరగతిలో ఎస్సీ 7, బీసీ-సి 10, బీసీ ఒకటి కలిపి 18 సీట్లు ఉన్నాయని వివరించారు. ఎనిమిదో తరగతిలో బీసీ-సి 5, ఎస్టీ 3, బీసీ ఒకటి, ఓసీ ఒకటి కలిపి 8 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అలాగే తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ 8, బీసీ-సి 10, బీసీ 3 కలిపి మొత్తం 21 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు మంగళవారం లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు ఈ నెల 27న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలిపారు. వివరాలకు 94411 02187 నంబర్‌లో సంప్రదించాలని రాణి సూచించారు.

ఎస్సీ గురుకులంలో చేరికకు దరఖాస్తులు

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరులో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకూ మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ నిర్మల కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులకు బుధవారం వరకూ అవకాశం ఉందని, 27న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని వివరించారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 10 గంటలకు ఆధార్ కార్డు నకలు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో రావాలన్నారు. ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు భర్తీ చేస్తామన్నారు. ఆరో తరగతిలో ఎస్టీ 3, బీసీ-సీ 2, బీసీ 1, ఓసీ 1 చొప్పున ఖాళీలున్నాయని తెలిపారు. ఏడో తరగతిలో ఎస్టీ 1, బీసీ 2, ఓసీ 1, ఎనిమిదో తరగతిలో ఎస్టీ 2, తొమ్మిదో తరగతిలో ఎస్టీ 1 చొప్పున ఖాళీలున్నాయని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకుని ప్రవేశ పరీక్షకు సకాలంలో హాజరు కావాలని నిర్మల కుమారి కోరారు.

రద్దయిన రైళ్లకు గ్రీన్ సిగ్నల్

సాక్షి ఇంపాక్ట్

రాజమహేంద్రవరం సిటీ: రైళ్లకు రెడ్ సిగ్నల్ శీర్షికన సాక్షి సోమవారం ప్రచురించిన కథనానికి దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు స్పందించారు. ఆధునీకరణ పేరుతో రైళ్లను ఆకస్మికంగా రద్దు చేయడంపై పునరాలోచన చేశారు. జిల్లా వాసుల అవసరాలను తీర్చే ప్రధానమైన ఆరు రైళ్ల రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. కాకినాడ పోర్ట్ - విజయవాడ - కాకినాడ పోర్ట్ మధ్య నడిచే 17258/17257 నంబరు మెమూ రైలును పునరుద్ధరించారు. విశాఖపట్నం - లింగంపల్లి (12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్, చెంగల్పట్టు - కాకినాడ పోర్ట్ (17643) సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను మంగళవారం నుంచి నడపనున్నట్టు ప్రకటించారు. బుధవారం నుంచి లింగంపల్లి - విశాఖపట్నం (12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్, కాకినాడ పోర్ట్ - చెంగల్పట్టు (17644) సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతామని తెలిపారు. దీనిపై రైల్వే ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్చ్.. ఇదేం మద్దతు!

- 14 రకాల పంటలకు మద్దతు ధర పెంచిన కేంద్రం
- వరికి రూ.117 మాత్రమే పెంపు
- పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా పెంచలేదంటున్న రైతులు

మద్దతు ధరల పెంపు (క్వింటాల్‌కు రూ.లు)
మద్దతు ధరలు

పంట	గత ఏడాది	ప్రస్తుతం	పెంపు
వరి సాధారణ రకం	2,183	2,300	117
వరి గ్రేడ్-ఎ	2,203	2,320	117
మొక్కజొన్న	2,090	2,225	135
కందులు	7,000	7,750	550
పెసలు	8,558	8,682	124
మినుములు	6,950	7,400	450
వేరుశనగ	6,377	6,783	406
పత్తి	7,020	7,521	501



కాకినాడ సిటీ: అన్నదాతలు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల 14 రకాల పంటలకు కనీస మద్దతు ధరలు ప్రకటించింది. వీటిల్లో జిల్లాలో పండేవి ఏడెనిమిది రకాలు ఉన్నాయి. కందులకు అత్యధికంగా రూ.550, పత్తికి రూ.501, వరికి రూ.117 చొప్పున కేంద్రం పెంచింది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఈ ధరలు అమలు చేస్తారు. కనీస మద్దతు ధర పెంచడం వల్ల తమకు కొంత వరకూ మేలు జరుగుతుందని, అయితే, ఈ పెంపు తమకు లాభసాటి కాదని రైతులు పెదవి విరుస్తున్నారు. పెరిగిన పెట్టుబడులకు తగినట్లుగా మద్దతు ధర పెంచలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్దతు ధరలు పెంచారిలా..

- వరికి ఇప్పటి వరకూ సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ.2,183, ఎ-గ్రేడ్‌కు రూ.2,203 కనీస మద్దతు ధర ఉండగా.. దీనిపై రూ.117 మాత్రమే పెంచారు. జిల్లాలో అత్యధికంగా దాదాపు 1.90 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగనుంది. పెరుగుతున్న పెట్టుబడులతో పోలిస్తే ఈ పెంపు తమకు పెద్దగా ప్రయోజకరం కాదని రైతులు అంటున్నారు.
- జిల్లా రైతులు 10,237 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. గత ఏడాది ఆశించిన ధర లేకపోవడంతో ఈసారి సాగు విస్తీర్ణం కొంత తగ్గే అవకాశముందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. గత ఏడాది తేమ శాతం ఆధారంగా పత్తికి కేంద్రం రూ.7,020 గరిష్ఠ ధర ప్రకటించింది. ఈ ఏడాది క్వింటాల్‌కు మరో రూ.521 పెంచింది. దీంతో సాధారణ రకానికి రూ.7,121, ఎ-గ్రేడ్‌కు రూ.7,521 చొప్పున మద్దతు ధర మాత్రమే దక్కనుంది. జిల్లాలో 2022-23లో క్వింటాల్ పత్తికి రూ.13 వేల వరకూ ధర పలికినా ఆ తర్వాత రూ.10 వేలకు పడిపోయింది. గత సీజన్‌లో అయితే నాణ్యమైన పత్తికి రూ.6 వేలకు మించి దక్కలేదు. ప్రభుత్వ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా రైతులకు ఆశించిన ప్రయోజనం కలగలేదు. దీనికి తోడు వర్షాభావ పరిస్థితుల్లో దిగుబడి లేక రైతులు నష్టపోయారు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది కేంద్రం పెంచిన ధర తమకు గిట్టుబాటు కాదని రైతులు చెబుతున్నారు.
- క్వింటాల్ కందులకు రూ.550, మినుములకు రూ.450, వేరుశనగకు రూ.406, పెసలకు రూ.124, మొక్కజొన్నకు రూ.135 చొప్పున కేంద్రం మద్దతు ధర పెంచింది.

జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం అంచనా (హెక్టార్లు)

పంట	విస్తీర్ణం
వరి	92,082
మొక్కజొన్న	238
పత్తి	4,095
మినుములు	1,125
చెరకు	3,755
కందులు	153
పెసలు	17
వేరుశనగ	7

పెరిగిన ఎరువుల ధరలు

పంటలకు మద్దతు ధర కాస్తంత మాత్రమే పెంచగా.. అటు సాగులో కీలకమైన ఎరువులు, పురుగు మందుల ధరలు భారీగా పెరిగాయి. కాంప్లెక్స్ ఎరువులు గతంలో రూ.1,300 ఉంటే ఇప్పుడు రూ.1,900కు చేరాయి. గతంలో రూ.900కు లభించిన పొటాష్ ధర రూ.1,650కు, డీఏపీ ధర రూ.1,350కు పెరిగాయి. వీటికి అదనంగా కూలి రేట్లు, ఇతర ఖర్చులు పెరగడంతో రైతులకు సాగు వ్యయం తడిసి మోపెడవుతోంది. పెరుగుతున్న పెట్టుబడితో పోలిస్తే ప్రభుత్వం ప్రకటిస్తున్న కనీస మద్దతు ధరలు గిట్టుబాటయ్యే పరిస్థితులు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారుతోంది. భూమికి కౌలు చెల్లించడంతో పాటు, పెట్టుబడులు కూడా పెట్టాల్సి ఉండడంతో అంతగా మిగిలేదేమీ ఉండదని అన్నదాతలు వాపోతున్నారు.

భవిష్యత్తును మత్తుకు బానిస కానీయవద్దు



అవగాహన సదస్సులో పాల్గొన్న జిల్లా ఎస్పీ, డీఎస్పీ, తదితరులు

గండేపల్లి: భవిష్యత్తును మత్తుకు బానిస కానీయవద్దని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ అన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగం, అనర్థాలు అనే అంశంపై సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలిసీ తెలియని వయస్సులో విద్యార్థులు చెడు అలవాట్లకు లోనై భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని, పొగ తాగటం, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రపంచ వ్యాప్తంగా ఏటా ఐదు నుంచి ఆరు శాతం ప్రజలు మత్తు పదార్థాలను వినియోగిస్తున్నారని చెప్పారు. వీరిలో విద్యార్థులే అధికంగా ఉన్నారన్నారు. మరో ముఖ్య అతిథి పెద్దాపురం డీఎస్పీ కె.లతా కుమారి మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమపై ఎన్నో ఆశలు పెట్టుకుని, తిని, తినకుండా తమ చదువుల కోసం ఎన్ని కష్టాలు పడుతున్నారో అనే ఆలోచన ప్రతి విద్యార్థీ గుర్తుచుకోవాలని అన్నారు. వ్యసనాలకు బానిసలై అనారోగ్యాలను కొనితెచ్చుకోవద్దని, భవిష్యత్తును మంచి మార్గం వైపు మళ్లించుకుని, రానున్న తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు, గండేపల్లి ఎస్సై ఎస్.రామకృష్ణ, యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాస రెడ్డి, ఆదిరెడ్డి రమేష్, ప్రిన్సిపాల్స్ ఎస్‌టీవీఎస్ కుమార్, డీస్స్ సత్యనారాయణ, వైకేఎస్ సుబ్బారావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో సమగ్రాభివృద్ధి

- జిల్లా నూతన కలెక్టర్ షన్మోహన్
- కలెక్టరేట్‌లో బాధ్యతల స్వీకరణ

కాకినాడ సిటీ: జిల్లాను అన్ని రంగాల్లోనూ పురోగామిగా నిలిపేందుకు, అందరి సమష్టి భాగస్వామ్యంతో సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని జిల్లా నూతన కలెక్టర్ సగిలి షన్మోహన్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సోమవారం ఆయన జిల్లా మూడో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ, పుష్కలమైన వనరులతో ప్రగతిశీల జిల్లాగా కాకినాడకు రాష్ట్రంలో మంచి గుర్తింపు ఉందన్నారు. జిల్లా విశిష్టతల గురించి పూర్వ కలెక్టర్ల ద్వారా తెలుసుకున్నానన్నారు. ఘనమైన చారిత్రక నేపథ్యం కలిగిన జిల్లా స్వరూపం, స్థితిగతులపై సత్వరమే సమగ్ర అవగాహన పెంపొందించుకుని, సమగ్రాభివృద్ధికి కార్యాచరణ చేపడతామని షన్మోహన్ చెప్పారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారులకు అందిస్తూ, ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లాను ప్రగతి పథంలో నడిపించేందుకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టరేట్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార సమావేశ హాలులో నూతన కలెక్టర్ షన్మోహన్ వివిధ శాఖల అధికారులను పరిచయం చేసుకున్నారు. వారి శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాల వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు జనరంజకమైన సమర్థ పాలన, సేవలు సజావుగా అందించేందుకు అధికారులందరూ సమన్వయంతో సమష్టిగా పని చేయాలని కోరారు. సంక్లిష్టమైన, వివాదాస్పదమైన అంశాలు ఎదురైతే తప్పనిసరిగా తనకు ముందుగా తెలియజేయాలని స్పష్టం చేశారు. తగు పరిష్కారంతో వారికి అండగా నిలుస్తానన్నారు. ఒత్తిళ్లు, ప్రలోభాలకు లోనై తప్పు చేస్తే ఉపేక్షించబోనని స్పష్టం చేశారు. ప్రజలు సేవలు అందించేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, ప్రధాన కార్యస్థానం విడిచి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా తనకు తెలియజేయాలని ఆదేశించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ షన్మోమోన్




ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ షన్మోహన్

పీజీఆర్ఎస్‌లో అర్జీల 250 స్వీకరణ

కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం - పీజీఆర్ఎస్) కార్యక్రమంలో నూతన కలెక్టర్ షన్మోహన్ పాల్గొన్నారు. డీఆర్ఓ తిప్పేనాయక్, జెడ్పీ సీఈఓ ఎ.శ్రీరామచంద్రమూర్తి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, సీపీఓ పి.త్రినాథ్ కలసి ప్రజల నుంచి 250 అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

వ్రత పురోహిత సంఘం అధ్యక్షుడిగా కన్నబాబు



అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో వ్రతపురోహిత సంఘం నూతన అధ్యక్షునిగా దేవస్థానం వైదిక కమిటీ సభ్యుడు, కల్యాణబ్రహ్మ చామర్తి వేంకటరెడ్డి పంతులు (కన్నబాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2024-26 కాలానికి సంబంధించి సంఘం కార్యవర్గ ఎన్నికలకు సోమవారం నామినేషన్లు స్వీకరించారు. గడువు ముగిసే సమయానికి అధ్యక్ష పదవికి కన్నబాబు ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన స్పెషల్ గ్రేడ్ వ్రత పురోహిత సూపర్‌వైజర్లు మంథా శ్రీరామ్మూర్తి, ప్రయాగ ఆంజనేయులు ప్రకటించారు. సంఘం కార్యదర్శిగా సవితాల వీర వేంకట రమణ (వీరబాబు), కోశాధికారిగా మొక్కరాల రాజేష్ కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వ్రత పురోహితులతో త్వరలోనే చర్చించి ఉపాధ్యక్షుడు, జాయింట్ సెక్రటరీ, ఇతర కార్యవర్గ సభ్యుల పేర్లను ఖరారు చేస్తామని కన్నబాబు తెలిపారు. దేవస్థానంలో పని చేస్తున్న 254 మంది వ్రత పురోహితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

ప్రభుత్వ ఐటీఐలో 28న క్యాంపస్ రిక్రూట్‌మెంట్

కాకినాడ సిటీ: ఈ నెల 28వ తేదీ ఉదయం 9 గంటలకు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎంవీజీ వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఫైనల్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు మెదక్, హైదరాబాద్, తుని ప్రాంతాలకు చెందిన ఐటీసీ లిమిటెడ్, ఏపీ ఇంజినీరింగ్, లిఫ్ట్ మెకానికల్, రానే బ్రేక్ లివింగ్ లిమిటెడ్, అరబిందో ఫార్మా తదితర కంపెనీల్లో ఈ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని వివరించారు. అన్ని ట్రేడుల విద్యార్థులూ ఇందులో పాల్గొనవచ్చని, ఆసక్తి ఉన్నవారు తమ బయోడేటాతో హాజరు కావాలని వర్మ కోరారు.

పంచారామ క్షేత్రంలో అభిషేకాలు పునఃప్రారంభం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి వారికి సోమవారం నుంచి అభిషేకాలను పునఃప్రారంభించారు. ఆలయంలో శివలింగం జీర్ణోద్ధరణ పనులను పురస్కరించుకొని గత నెల 29 నుంచి స్వామి, అమ్మవార్ల గర్భాలయ దర్శనాలు నిలిపివేసిన విషయం విదితమే. సుమారు 20 రోజుల తరువాత ఈ నెల 17 నుంచి స్వామి, అమ్మవార్ల దర్శనాలకు అనుమతి ఇచ్చారు. స్వామి వారికి ఆదివారం వరకూ అభిషేకాలు నిలిపివేయాలని కేంద్ర పురావస్తు శాఖ సూచించింది. ఆ గడువు పూర్తి కావడంతో సోమవారం నుంచి అభిషేకాలను పునఃప్రారంభించామని ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. పిఠాపురం మహారాజా గోత్రనామాలతో తొలి అభిషేకం, తొలి పూజలు చేశారు. అభిషేక ప్రియుడైన శివునికి అభిషేకాలు తిరిగి ప్రారంభం కావడం, స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు.



భీమేశ్వర స్వామికి తొలి అభిషేకం చేస్తున్న అర్చకులు

ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి నీళ్లు, పాలతో అభిషేకాలు చేసుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాలను ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, చెరుకూరి రాంబాబు, సన్నిధిరాజు వెంకన్న, అళ్లకి రాజ్‌గోపాల్, వినయ్ నిర్వహించారు. ఈఓ నీలకంఠం ఆధ్వర్యాన భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

మరిడమ్మ వారికి రూ.3.82 లక్షల ఆదాయం


పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారికి ఆలయ హుండీల ద్వారా 93 రోజులకు రూ.3,82,695 ఆదాయం సమకూరిందని అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు తెలిపారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, పెద్దాపురం డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయ్‌బాబు నాయుడు, ఈఓ సత్యనారాయణల సమక్షంలో హుండీలను సోమవారం తెరచి ఆదాయం లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు, ఆసాదులు, దేవస్థానం సిబ్బంది, మహిళా భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

సత్యదేవుని నిత్య కల్యాణంలో అపచారం

- ఒకే సింహాసనంపై వధూవరులు, పెళ్లి పెద్దలు సీతారాములు
- సత్యదేవుడు, అమ్మవారి దిగువన సీతారాముల విగ్రహాలు
- ఆ మూర్తుల పైనా తలంబ్రాలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రతి నిత్యం జరిగే కల్యాణోత్సవం నిర్వహిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. పెళ్లి పెద్దలు సీతారాములను ప్రత్యేక ఆసనంపై కాకుండా సత్యదేవుడు, అమ్మవారు ఉన్న సింహాసనంపై దిగువన ఉంచి, కల్యాణ క్రతువు నిర్వహించడంపై విమర్శలు వస్తున్నాయి. ఇది ఒక రకంగా అపచారమని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చాలా సంవత్సరాలుగా సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి రత్నగిరిపై ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకూ నిత్య కల్యాణం నిర్వహిస్తారు. దీనికి రత్నగిరి క్షేత్ర పాలకులైన సీతారాములు పెళ్లి పెద్దలుగా వ్యవహరించడం సంప్రదాయం. ఉదయం 8.30 గంటలకు సీతారాముల విగ్రహాలను పల్లకీ మీద ఊరేగింపుగా సత్యదేవుని ఆలయం వద్దకు తీసుకుని వచ్చి, అక్కడ అదే పల్లకీ మీద సత్యదేవుడు, అమ్మవారి విగ్రహాలను కూడా ఉంచి, ఊరేగింపుగా స్వామివారి నిత్యకల్యాణ మండపానికి తీసుకు వెళ్తారు. అక్కడ కల్యాణ వేదిక మీద ఉన్న వెండి సింహాసనంపై సత్యదేవుడు, అమ్మవారిని వేంచేయిస్తారు. ఆ పక్కనే మరో సింహాసనంపై సీతారాములను కూడా వేంచేయిస్తారు. అనంతరం, వారి సమక్షంలో సత్యదేవుడు, అమ్మవారికి నిత్య కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. గతంలో ఇలానే జరిగేది.



ఇలా చేయాలి: సత్యదేవుని వార్షిక కల్యాణోత్సవంలో సత్యదేవుడు, అమ్మవారి పక్కన మరో సింహాసనంలో సీతారాములు

ఏం జరుగుతోందంటే..

అయితే, సీతారాములను మరో సింహాసనం మీద ఉంచడం ఎందుకనుకున్నారో లేక మరే ఇతర కారణమో తెలియదు కానీ.. కొద్ది రోజులుగా సత్యదేవుడు, అమ్మవారు ఉన్న సింహాసనం మీదనే అమ్మవారి దిగువన సీతారాముల విగ్రహాలు ఉంచి నిత్య కల్యాణం నిర్వహిస్తున్నారు. దీని వలన కల్యాణ ఘట్టంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి పోస్తున్న తలంబ్రాలు సీతారాముల విగ్రహాల మీద కూడా పడుతున్నాయి. ఇది గమనించిన భక్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సత్యదేవుని కల్యాణానికి సీతారాములను పెళ్లి పెద్దలుగా పేర్కొంటూ మంత్రాలు చదువుతున్న అర్చకులు, పండితులు.. స్వామి, అమ్మవారి సింహాసనంపై వారి దిగువన సీతారాములను ఉంచడమే ఒక తప్పని అంటున్నారు. పైగా స్వామి, అమ్మవారికి పోసే తలంబ్రాలు పెళ్లి పెద్దలపై కూడా పడుతూండటం అపచారమని అభిప్రాయపడుతున్నారు.



ఇలా చేస్తున్నారు: సత్యదేవుని నిత్యకల్యాణంలో సత్యదేవుడు అనంతలక్ష్మీ సత్యవతీదేవి విగ్రహాలున్న సింహాసనంపై దిగువన సీతారాముల మూర్తులు

సీతారాములను ప్రత్యేక సింహాసనంపై ఉంచాలి

నిత్య కల్యాణంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల దిగువన సీతారాములను ఉంచి కల్యాణం నిర్వహిస్తూండటంపై అన్నవరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కొంత మంది భక్తులు తనకు ఫిర్యాదు చేశారని ‘సాక్షి’కి చెప్పారు. సీతారాములను మంగళవారం నుంచే ప్రత్యేక సింహాసనం మీద ప్రతిష్ఠించి కల్యాణం నిర్వహించాలని ఆలయ ఏఈఓ డీవీఎస్ కృష్ణారావును, కల్యాణ బ్రహ్మ, దేవస్థానం వైదిక కమిటీ సభ్యుడు చామర్తి వేంకటరెడ్డి పంతులు(కన్నబాబు)ను ఆదేశించామని తెలిపారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


సతీష్ (ఫైల్)

నల్లజర్ల: ప్రకాశ రావుపాలెం కొత్తపేట కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద సోమవారం ఉదయం యువకుడు మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ దుర్గాప్రసాద్ సంఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన బుసనబోయిన దొరబాబు, పెదబుజ్జిల పెద్ద కుమారుడు సతీష్ (24) ఆదివారం రాత్రి బయట పనిఉందని తల్లితో చెప్పి వచ్చాడు. తెల్లారేసరికి ఇలా మృతి చెందాడు. అతడు బోర్ రిగ్గుల వద్ద పనిచేస్తుంటాడని స్థానికులు తెలిపారు. సతీష్ మృతదేహం వద్ద రక్తం ఉండటం, అతని కాలు విరిగిపోయి ఉండటాన్ని బట్టి ట్యాంకుపై నుండి దూకి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తునిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసునమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.


కొబ్బరిచెట్టు విషయమై ఘర్షణ : కేసు నమోదు

మామిడికుదురు: నగరం గ్రామం సరిహద్దులో ఉన్న కొబ్బరిచెట్టు విషయమై తగాదా పడిన రెండు కుటుంబాలపై వేర్వేరుగా కేసులు నమోదు చేసినట్టు ఎస్సై పి.సురేష్ సోమవారం తెలిపారు. కొత్తరోడ్డుకు చెందిన వెలిగొట్ల సూర్యకుమారి, వెలిగొట్ల విజయలక్ష్మి సరిహద్దులో ఉన్న కొబ్బరి చెట్టు విషయమై ఘర్షణ పడి ఇద్దరూ గాయపడ్డారు. పరస్పర ఫిర్యాదుల మేరకు ఇద్దరిపై కేసులు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

బుడిబుడి అడుగులు బడివైపే

- చిన్నారుల చేరికలే లక్ష్యంగా 'విద్యా ప్రవేశం'
- 1–8 తరగతుల్లో చేరికలకు ప్రత్యేక డ్రైవ్
- జూలై 25 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా, దీక్ష సంయుక్త కార్యాచరణ





రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసిన 'విద్యా ప్రవేశం' పోస్టర్

రాయవరం: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం 'విద్యా ప్రవేశం' పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. ఒకటి నుంచి నుంచి 8వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో బడిఈడు చిన్నారులందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచడం ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా, దీక్ష సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేసేందుకు షెడ్యూల్ విడుదల చేశారు. నాలుగు వారాల పాటు చేపట్టే ఈ కార్యక్రమంలో భాగంగా ఆ తరగతులకు బడిఈడు చిన్నారులను బడిలో చేర్పించేందుకు పాఠశాల పేరెంట్స్ కమిటీ, ఉపాధ్యాయులు కలిసి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నారు.

విద్యార్థుల చేరికలే లక్ష్యం

బడి బయట విద్యార్థులను బడిలో చేర్పించేందుకు ఇప్పటికే 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా అభియాన్ చేపడుతోంది. తాజాగా విద్యా ప్రవేశం కార్యక్రమం కింద పాఠశాల ఆవాస ప్రాంతాల్లో ఉన్న బడి ఈడు చిన్నారులను గుర్తించి వారి వివరాలు సేకరించి బడిలో చేర్పించాలి. ఈ కార్యక్రమ నిర్వహణకు దీక్ష ప్లాట్‌ఫామ్‌ను వినియోగించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు..

ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని దశల్లో పర్యవేక్షణ చేయాల్సి ఉంది. ముందుగా ఈ నెల 24 నుంచి జూలై 12 వరకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను పాఠశాల స్థాయిలో నిర్వహించాలి. ఈ కార్యక్రమాన్ని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారు. జిల్లా, మండల స్థాయి విద్యాశాఖ అధికారులు తరచుగా పాఠశాలలు సందర్శించాలి. విద్యార్థుల అడ్మిషన్లు జరిగే పాఠశాలలకు తరచుగా సందర్శించి అడ్మిషన్ ప్రక్రియను నిశితంగా పరిశీలించాలి. గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సహకారంతో ఇంటింటికీ తిరుగుతూ విద్య వల్ల కలిగే లాభాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలపై పిల్లలతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలకు పంపేలా చర్యలు తీసుకోనున్నారు.

ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను వివరిస్తూ..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను వివరిస్తూ అధికారులు, ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాల్సి ఉంది. పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న స్టూడెంట్ కిట్లు, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, చక్కని వసతి సౌకర్యాలు, డిజిటల్ విద్య తదితర సౌకర్యాలను తల్లిదండ్రులకు తెలియపర్చాల్సి ఉంది. మొదటి దశ ఈ నెల 24 నుంచి జూన్ 27 వరకు నమోదు పెంపునకు అందుబాటులో ఉన్న అభ్యసన మూలాలను పరిశీలించాలి. హెచ్‌ఎంలకు ఓరియంటేషన్ ఆన్‌లైన్ తరగతిని సోమవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించారు. జూన్ 28 నుంచి జూలై 25 వరకు మండల, డివిజన్, జిల్లా స్థాయి ప్రణాళిక నిర్వహిస్తారు. ఈ దశలో పాఠశాలలను అధికారులు సందర్శించడం, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌కు ఏమి చర్యలు తీసుకున్నారో పరిశీలించడం, అడ్మిషన్ల ప్రక్రియపై వివిధ స్థాయిల్లో సమీక్ష నిర్వహిస్తారు. అధికంగా ఎన్‌రోల్‌మెంట్ చేసిన ప్రధానోపాధ్యాయులను గుర్తిస్తారు. గడచిన ఐదేళ్లలో ఆయా పాఠశాలల్లో నమోదైన అడ్మిషన్ల వివరాలను పరిశీలించి, విశ్లేషిస్తారు. అలాగే పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులతో సమావేశమై చేరికలపై నివేదిక తయారు చేసి, అడ్మిషన్ల పెరుగుదలపై సమీక్షిస్తారు. దీక్ష ప్లాట్‌ఫామ్ ద్వారా మూడు దశల్లో పర్యవేక్షిస్తారు. విద్యాప్రవేశం ద్వారా పరిశీలించి, గమనించిన అంశాలను అధ్యయనం చేస్తారు. ఈ మేరకు రాష్ట్ర స్థాయి అధికారులు మూడు పోస్టర్లను వాట్సప్ గ్రూపుల ద్వారా విడుదల చేశారు.

విజయవంతం చేయాలి



విద్యా ప్రవేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలి. పేరెంట్స్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులను కలుపుకొని, షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలి. క్రింది స్థాయి నుంచి పై స్థాయి వరకు అందరూ సమన్వయంతో విధులు నిర్వహించాలి.

– ఎ.మధుసూదనరావు, డిప్యూటీ కలెక్టర్, అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్, సమగ్ర శిక్షా అభియాన్, అమలాపురం

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'విద్యా ప్రవేశం' కొత్త కార్యక్రమాన్ని విజయంతం చేసేందుకు అందరూ కృషి చేయాలి. ఇప్పటికే బడిబయట చిన్నారులను గుర్తించేందుకు కూడా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో బడిఈడు పిల్లలను గుర్తించి బడుల్లో చేర్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

కువైట్ బాధితుల అంశాన్ని మండలిలో చర్చిస్తాం

- శాసనసభ స్పీకర్‌కూ లేఖ రాశా
- ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



అమలాపురం టౌన్: సరైన అనుమతులు, ఆధారాలు లేకుండా కువైట్‌లో చిక్కుకుపోయి అవస్థలు పడుతున్న తెలుగు వారి సమస్యలపై శాసన మండలిలో చర్చిస్తామని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తెలిపారు. ఈ సమస్యపై అసెంబ్లీలోనూ చర్చించాలని ఆ సభ స్పీకర్‌కు లేఖ రాశానన్నారు. అసోసియేషన్ ఆఫ్ హౌస్ మెయిడ్స్ ఇన్ గల్ఫ్ కంట్రీస్ అండ్ ద వరల్డ్ ఫ్రమ్ గోదావరి డెల్టా రీజియన్ చైర్మన్ హోదాలో ఆయన ఈ అంశంపై అమలాపురంలో సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. తమ అభ్యర్థన మేరకు క్షమాభిక్ష తేదీని కువైట్ రాజకుమారి ఈనెల 30వ వరకూ పొడిగించారని అన్నారు. అనుమతులు, పత్రాలు సరిగా లేని తెలుగు వారు 30వ తేదీ లోపులో రాలేకపోతే వారిని అరెస్టు చేసి జైళ్లలో పెడతారని కుడుపూడి వివరించారు. అక్కడి బాధితులకు ఈ ప్రకటన చేరకపోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అక్కడ తెలుగు వారికి భాష రాకపోవడం, న్యూస్ పేపర్లు చూసే అవకాశం లేకపోవడం వల్ల వారు ఆ చెర నుంచి బయట పడలేకపోతున్నారన్నారు. వారిని కాపాడాల్సిన బాధ్యత తమపై ఉందని, ఆ దేశంలో ఇబ్బంది పడుతున్నవారు ఇక్కడి వారికి ఫోన్ చేసినపుడు క్షమాభిక్షకు 30వ తేదీ గడువనే విషయాన్ని వివరించాలని ఆయన కోరారు. అలాగే సామాజిక కార్యకర్త బాబీ గాబ్రియల్ తదితరులతో తాము వారిని రప్పించేందుకు శ్రమిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈ తరహా బాధితులు అధికంగా ఉన్న రాజోలు నియోజకవర్గంలో తాము పర్యటించి కొందరి బాధితుల తాలూకు ఇళ్లకు వెళ్లి క్షమాభిక్ష అంశాన్ని బాధితులకు వివరించాలని కోరినట్టు ఎమ్మెల్సీ తెలిపారు.

వైభవంగా శ్రీరుద్ర, శతచండీ, మహాసౌర యాగం


కేశనకుర్రుపాలెంలో నిర్వహిస్తున్న మహా సౌరయాగం పూజలు

ఐ.పోలవరం: కేశనకుర్రుపాలెం గ్రామంలో కొలువైన రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీరుద్ర, శతచండీ, మహాసౌర యాగం కన్నుల పండుగగా జరుగుతోంది. సోమవారం ఆలయంలో గణపతి పూజ, గవ్యాంతము, మహన్యాసము, రుద్రాభిషేకం, శతసహస్ర బిల్వార్చన, సూర్య నమస్కారాలు, చండీ పారాయణ, మహాసౌర హోమం, చండీ హోమం, రుద్ర హోమం, కుంకుమపూజ, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పం ఘనంగా జరిగాయి. 12రోజుల పాటు జరిగే ఈయాగ ఆచార్యులుగా ఆగమ విశారద, ఆఘోర శివాచార్య కాళ్లకూరి దుర్గాప్రసాద్ శర్మ, యాగ బ్రహ్మ కాళ్లకూరి కామేశ్వర శర్మ, వెలవల్లి చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో పలువురు వేదాగమ పండితులచే నిర్వహిస్తున్నారు. ఈ యాగాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రతి నిత్యం అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ పేర్కొంది. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు, విద్యుద్దీపాలు, పచ్చిపూల అలంకరణ భక్తులను ఆకట్టుకున్నాయి.

27న నిధి ఆప్‌కే నిఖత్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈ నెల 27వతేదీ గురువారం ఉదయం 9 గంటల నుంచి నిధి అప్‌కే నిఖత్–డిస్ట్రిక్ట్ ఔట్ రీచ్ ప్రోగ్రామ్ జరుగుతుందని రీజనల్ పీఎఫ్ కమిషనర్–2 వైడీ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం ఇన్నీసుపేటలోని ఇన్వెన్సిస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లోను, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో వారికి యానాం రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో, కాకినాడ జిల్లాలో కాకినాడ కోరమాండల్ ఇండస్ట్రీస్‌లో, ఏలూరు జిల్లా పరిధిలోని వారికి దేవరపల్లిలోని హర్షవర్ధన ఇంగ్లీష మీడియం స్కూల్లో, పశ్చిమ గోదావరి జిల్లాలో భీమవరం విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీలోను, అల్లూరి సీతారామరాజు జిల్లాలో వై.రామవరంలో ఏపీ ఈపీ డీసీఎల్ సబ్‌స్టేషన్‌లోను, కొత్తాడ కేజీబీవీ స్కూల్లోను, మారేడుమిల్లి పంచాయతీలోను నిధి ఆప్‌కే నిఖత్ జరుగుతుందన్నారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్‌మెంట్, కొత్తగా కవర్ చేయబడిన ఎస్టాబ్లిష్మెంట్‌లు ఈఅవుట్ రీచ్ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకోవాలన్నారు. నిధి ఆప్‌కే నిఖత్ అని పేర్కొంటూ తమ ఫిర్యాదులను సమర్పించవచ్చన్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ బకాయి ఉన్న పింఛనుదారులు, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడానికి ఈ శిబిరాన్ని సందర్శించవచ్చని రీజనల్ పీఎఫ్ కమిషనర్–2 వైడీ శ్రీనివాస్ తెలిపారు.

అత్యాచారం కేసులో 15 ఏళ్ల జైలు

మైనర్‌ను గర్భవతిని చేసిన కేసులో నిందితుడికి రూ.7 వేల జరిమానా

అమలాపురం టౌన్: మైనర్‌పై అత్యాచారం చేసి గర్భవతిని చేసిన నేరం రుజువు కావడంతో అమలాపురం మద్దాలవారిపేటకు చెందిన కర్రెళ్ల గణపతికి 15 ఏళ్ల జైలు శిక్ష, రూ.7 వేలు జరిమానా విధిస్తూ కాకినాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.శ్రీదేవి సోమవారం తీర్పు ఇచ్చారు. సీఐ కె.క్రిస్టోఫర్ తెలిపిన వివరాల మేరకు మద్దాలవారిపేటకు చెందిన బాలికపై అదే ప్రాంతానికి చెందిన కర్రెళ్ల గణపతి 2018 ఏప్రిల్ 2న అత్యాచారం చేశాడన్నది అభియోగం. ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయంలో ఆ బాలికకు మత్తు పానీయాలు ఇచ్చి లోబరచుకుని, ఈ విషయాన్ని మీ తల్లిదండ్రులకు చెబితే చంపేస్తానని బెదిరించాడు. గణపతి వల్ల తమ బాలిక గర్భవతి అయినట్లు గుర్తించి అప్పట్లో బాలిక కుటుంబీకులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి పట్టణ ఎస్సై జి.సురేంద్ర నిందితునిపై కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు దర్యాప్తు చేసి నిందితుడు గణపతిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు పంపించారు. సోమవారం జరిగిన తుది విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పితాని శ్రీనివాసరావు కోర్టులో వాదోపవాదనలు వినిపించారు. ఈ కేసును దర్యాప్తు చేసిన అప్పటి పట్టణ ఎస్సై సురేంద్ర, దర్యాప్తు అధికారి అయిన డీఎస్పీ వెంకటేశ్వరరావులను జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ అభినందించారు.

చెట్టు పైనుంచి పడి యువకుడి మృతి


మృతుడు మైలే నాగరాజు

పెరవలి: కన్నతండ్రి లేడు, తల్లి అనారోగ్యంతో ఆసుపత్రి పాలైంది. మామిడికాయలు కోసే కూలిపనికి వెళ్లి చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా కాలు జారి పడి అతడు ప్రాణాలు కోల్పోయాడు. పెరవలి ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలం అన్నవరప్పాడు గ్రామానికి చెందిన మైలే నాగరాజు (33) సోమవారం పనికి వెళ్లి వచ్చి మధ్యాహ్నం మామిడి కాయలు కోయడానికి వెళ్లాడు. అక్కడ ప్రమాదశాత్తు చెట్టుపై నుంచి పడి ప్రాణాలు విడిచాడని తెలిపారు. నాగరాజుకు భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మూర్తి తెలిపారు.

మండపేటలో మరో శిలాఫలకం ధ్వంసం

- మండిపడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు
- దారుణాలు ఆపకపోతే ప్రతిఘటన తప్పదని రాజబాబు, పాపారాయుడు హెచ్చరిక


ధ్వంసమైన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న పాపారాయుడు, రాజబాబు తదితరులు

మండపేట: కూటమి ప్రభుత్వంలో ఆ పార్టీల కార్యకర్తలు పేట్రేగిపోతున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ మండిపడ్డారు. ఇటీవల పట్టణంలో జరిగిన శిలాఫలకాల ధ్వంసం ఘటనలు మరువక ముందే మండపేటలో మరో శిలాఫలకం ధ్వసం చేశారు. ఆదివారం రాత్రి తాపేశ్వరం రోడ్డు లాకుల వద్దకు వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన ద్వారపూడి–మండపేట రోడ్డుకు సంబంధించిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వసం చేశారు. సమాచారమందుకున్న వైఎస్సార్ సీపీ నేతలు రాజబాబు, పాపారాయుడు కార్యకర్తలతో కలిసి అక్కడి వెళ్లి శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన తీరును పరిశీలించారు. వారితో పాటు ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ భర్త కుడుపూడి రాంబాబు, వైఎస్సార్ సీపీ రూరల్, అర్బన్ కన్వీనర్లు పిల్లా వీరబాబు, నాయకులు అక్కడి పరిస్థితిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజబాబు మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఆగడాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయని, ఇదే కొనసాగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కొనాల్సి వస్తుందని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తామూ ఇదే విధంగా వ్యవహరిస్తే టీడీపీ వారి శిలాఫలకాలు వుంటాయా అని ప్రశ్నించారు. పనిగట్టుకుని మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వున్న ఫొటోలను ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఇలాంటి పనులు చేయిస్తారని తాను అనుకోవడం లేదని గతంలో చెప్పామని, ఈ ఘటనలపై నిగ్గు తేల్చాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై వుందని హెచ్చరించారు.

పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాపారాయుడు మాట్లాడుతూ మండపేటలో పరిస్థితి చూస్తుంటే రావణ కాష్టాన్ని తలపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వేగుళ్ల గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తు చేసుకుంటే బాగుంటుందన్నారు. తోట త్రిమూర్తులు వచ్చాక మండపేటలో గొడవల మొదలయ్యాయని అనే వారన్నారు. త్రిమూర్తులు వున్నప్పుడు ఎలాంటి సంస్కృతి వుండేదో, మీరొచ్చాక ఏవిధమైన సంస్కృతికి తెర తీస్తున్నారో సమీక్షించుకుంటే బాగుంటుందన్నారు. జోగేశ్వరరావు ఇలాంటి ఘటనలను కొనసాగిస్తారా లేక ఇక్కడితో ఆపేస్తారా అనేది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. తాము కూడా చేతకాని వారం కాదని, ఇకనైనా ఆపకపోతే భవిష్యత్‌లో ఏదైనా జరిగితే వాటి ఎమ్మెల్యే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సాధనాల శివ, తణుకు అశోక్, సాకా సత్యనారాయణ, గనిశెట్టి సత్తిబాబు, సాంబత్తుల జయబాబు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ సిగరెట్లపై విజిలెన్స్

- అమలాపురంలో ఆకస్మిక దాడులు
- రూ.17.44 లక్షల విలువైన సొత్తు సీజ్


దాడుల్లో పట్టుబడ్డ అన్ బ్రాండెడ్ సిగరెట్ల నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

అమలాపురం టౌన్: రాజమహేంద్రవరం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అమలాపురంలోని మూడు హోల్ సేల్ షాపులపై సోమవారం దాడులు చేసి రూ.17.44 లక్షల విలువైన నకిలీ సిగరెట్లను సీజ్ చేశారు. స్థానిక గొల్లగూడెంలోని నిషికా ఎంటర్‌ప్రైజెస్ షాపు, యర్రమిల్లివారి వీధిలోని శ్రీదేవి జనరల్ స్టోర్స్, వరలక్ష్మి జనరల్ మర్చంట్స్ హోల్ సేల్ షాపులపై ఈ దాడులు జరిగాయి. విజిలెన్స్ ఎస్పీ కేఎస్‌వీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు విజిలెన్స్ డీఎస్పీ పి.ముత్యాల నాయుడు ఆధ్వర్యంలో సీఐలు టి.శ్రీనివాసరెడ్డి, నాగ వెంకటరాజు ఈ దాడులు చేసి 3,873 సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఐటీసీ కంపెనీ ఉత్పత్తుల నుంచి కాకుండా నిషేధిత సిగరెట్లను అక్రమంగా విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఎలాంటి పన్నులు చెల్లించకుండా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న అన్ బ్రాండెడ్ పారిస్, హార్బర్ గోల్డ్, జీటీపీఎల్ విమల్, జీపీటీఎల్ ఫిల్టర్, గోల్డ్ విమల్, వైట్ ఫ్లేక్, జారుమ్ బ్లాక్ తదితర రకాల సిగిరెట్లను ఈ దాడుల్లో సీజ్ చేశారు. నిషికా ఎంటర్‌ప్రైజెస్ షాపు నుంచి రూ.14.31 లక్షలు విలువైన, శ్రీదేవి జనరల్ మర్చంట్స్ షాపు నుంచి రూ.1.98 లక్షల విలువైన, వరలక్ష్మి జనరల్ మర్చంట్స్ షాపు నుంచి రూ.1.09 లక్షల విలువైన అన్ బ్రాండెడ్ సిగరెట్లను గుర్తించారు. బంగ్లాదేశ్ తదితర దేశాల్లో అతి చౌకగా లభించే ఈ నకిలీ సిగరెట్లను దిగుమతి చేసుకుని ఈ హోల్ సేల్ వ్యాపారులు రిటైల్ దుకాణాలకు సరఫరా చేసి విక్రయిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ఉదాహరణకు బ్రాండెడ్ సిగరెట్ రూ.10 నుంచి రూ.15 వరకూ ధర ఉంటే ఈ అన్ బ్రాండెడ్ సిగరెట్‌ను రూ.2 నుంచి రూ.5 కే విక్రయిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. మూడు షాపుల యాజమానులపై సీవోపీటీఏ యాక్ట్–2023 కింద క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు విజిలెన్స్ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ డీఎస్పీ, సీఐలతో పాటు ఎస్సైలు, సిబ్బంది భార్గవ మహేష్, లక్ష్మీ నారాయణ, నవీన్‌కుమార్, జగన్నాథరెడ్డి, జీవా, లోవరాజు, వలీ, వీరబాబు, కిషోర్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


చక్రధొర (ఫైల్)

కొత్తపల్లి: ఒక యువతి మానసికంగా వేధిస్తుండడంతో మనస్తాపానికి గురై ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొండెవరం గ్రామానికి చెందిన బండి చక్రదొర (26), అదే గ్రామానికి చెందిన మామిడాల మనీష ప్రేమించుకుని 2021లో కుటుంబ సభ్యులకు తెలియకుండా వివాహం చేసుకున్నారు. అయినప్పటికీ మనీష తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో వారు పోక్సో చట్ట ప్రకారం కేసు నమోదు చేసి జైలుకు పంపారు. అప్పటి నుంచి మనీష తల్లిదండ్రులతో కలిసి హైదరాబాదులో ఉంటుంది. ఇటీవల పరీక్షలు రాసేందుకు కొండెవరం వచ్చిన ఆమెను జైలు నుంచి విడుదలై వచ్చిన చక్రదొర వేధిస్తున్నాడని పిఠాపురం టౌన్, కొత్తపల్లి పోలీసు స్టేషన్లలో ఫిర్యాదు చేసింది. దీంతో మనస్తాపానికి గురై అతడు తన ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చక్రదొర సోదరుడు స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై స్వామి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలాన్ని సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అగ్నిప్రమాదంలో రూ.8 లక్షల ఆస్తినష్టం

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో బుధవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల రేకుల షెడ్డుకు నిప్పంటుకుని రూ.8 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామంలోని గంధం రాముకు చెందిన రేకుల షెడ్డు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతైంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఎదురుగా ఉన్న గొల్లపల్లి రాజరాజేశ్వరరావుకు చెందిన గృహోపకరణాలు, విద్యుత్ బోర్డులు కాలిబూడిదై సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. రాముకు చెందిన గృహోపకరణాలతో పాటు ఇంటిలో ఉన్న రెండున్నర కాసుల బంగారం, రూ.50 వేల నగదు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.5 లక్షల ఆస్తి నష్టం సంభవించింది.